సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 26 । మే । 2023



## అన్ని రంగాల్లో రాణించాలి

యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు పోలీసుశాఖ సిద్ధంగా ఉందని, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వేణుగోపాలరావు అన్నారు. 8లో



## బాధ్యతగా పర్యావరణ రక్షణ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, చెట్లను నాటి పరిరక్షించాలని అటవీశాఖ అధికారులు సూచించారు. 8లో



## వికసించిన బ్రహ్మకమలాలు

అడ్డతీగల: రాయపల్లిలోని రాష్ట్ర రోడ్ డవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సత్యనారాయణ ఇంటిలో బ్రహ్మకమలాలు విరబూశాయి.

## న్యూస్‌రీల్

### కలప అక్రమ రవాణాపై గట్టి నిఘా

- రంపచోడవరం రేంజ్ అధికారి అజాద్
- బాధ్యతల స్వీకరణ



రంపచోడవరం: రంపచోడవరం రేంజి అధికారిగా షేక్ అజాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. రేంజ్ అధికారిగా ఈ ప్రాంతంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఆయన విధుల్లో చేరారు. రంపచోడవరం ఇన్‌చార్జి రేంజర్ దుర్గా కుమార్ బాబు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆజాద్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం నుంచి అక్రమ కలప తరలింపుపై గట్టి నిఘా పెడతామన్నారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### 'అమృతధార' సందర్శన నిలిపివేత

- భద్రత చర్యలు చేపట్టనున్న అటవీశాఖ
- రేంజ్ అధికారి కరుణాకర్

మారేడుమిల్లి : మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశమైన అమృతధార జలపాతం సందర్శనను తాత్కాలికంగా నిలిపివేసినట్టు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎం. కరుణాకర్ గురువారం తెలిపారు. బుధవారం అమృతధార జలపాతం వద్ద విహార యాత్రకు వచ్చిన పర్యాటకురాలిపై చెట్టు కొమ్మ పడటంతో తీవ్ర గాయాల పాలై మృతి చెందడం తెలిసిందే. ఈనేపథ్యంలో జలపాతం వద్ద మెరుగైన భద్రత చర్యలు చేపట్టే నిమిత్తం సందర్శన నిలిపివేస్తున్నామని రేంజ్ అధికారి తెలిపారు. జలపాతం వద్ద భారీ చెట్ల కొమ్మలు, ప్రమాదకరంగా మారిన బండరాళ్ల తొలగింపు చేపడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. సందర్శకులు సమస్యను గుర్తించి సహకరించాలని ఆయన కోరారు. సందర్శన ఎప్పటినుంచి అందుబాటులోకి తెస్తామనేది ఉన్నతాధికారుల సూచనల మేరకు త్వరలో తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

### పట్టుదలతో చదవాలి

- గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు
- విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పరిశీలన



మాట్లాడుతున్న డీడీ కొండలరావు

పెదబయలు: విద్యార్థులు పట్టుదలతో లక్ష్యసాధన దిశగా చదివినప్పుడే అనుకున్నది సాధించవచ్చని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు అన్నారు. గురువారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల, బాలురు పాఠశాల–2 కోచింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. సందేహాలను ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువెళ్లి నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు.

### పిడుగుపాటుకు గిరిజనుడి మృతి



రమణ మృతదేహం

అనంతగిరి: మండలంలోని గుమ్మకోట పంచాయతీలో పిడుగుపాటుకు గిరిజనుడు మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. గుమ్మకోట గ్రామానికి చెందిన కొర్రా రమణ(47) గురుకులం పాఠశాలలోని వంటకుక్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి నైట్‌డ్యూటీ నిమిత్తం పాఠశాలకు వెళుతుండగా.. మార్గమధ్యలోని పిడుగుపాటుకు గురై అపస్మారస్థితికి చేరుకున్నాడు. అటువైపుగా వెళుతున్న వృద్ధుడు, గ్రామస్తులకు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే రమణ మృతి చెందాడు. భార్య, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గుమ్మకోట గ్రామంలోని విషాదఛాయలు అలుముకున్నాయి.

### విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ఈ సీజన్‌లో ఆంధ్రా ఊటీ అరకు వెళ్లే రైల్వే ప్రయాణికుల, పర్యాటకుల సౌకర్యార్థం ఈస్ట్‌కోస్ట్‌రైల్వే విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం రైలుకు ఆయా తేదీల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. జూన్ 2,4,6,8,10,12,14,16,18, 20,22,24, 26,28, 30 తేదీల్లో విశాఖలో బయల్దేరే విశాఖ– కిరండూల్(08551)రైలుకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో జూన్ 3,5,7,9,11,13, 15,17,19, 21,23,25,27,29, జూలై 1వ తేదీలలో బయల్దేరే కిరండూల్ –విశాఖ (08552)రైలుకు మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

# ఉద్యమంలా సేద్యం

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 30 ఏళ్లుగా కూరగాయల సాగుపైనే ఆధారపడి ఆ గ్రామ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం అందించే రైతు భరోసా సొమ్మును పెట్టుబడిగా ఉపయోగించి ఏడాది పొడవునా వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. సాగులో కుటుంబ సభ్యులంతా మమేకమై ఉపాధి పొందుతూ సాటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు వనభసింగి గిరి రైతులు.

- కూరగాయల సాగుతో మంచి ఫలితాలు
- అధిక లాభాలు ఆర్జిస్తున్న వనభసింగి గిరి రైతులు
- ఏడాది పొడవునా వివిధ రకాల పంటలు
- వారపు సంతల్లో నేరుగా మార్కెటింగ్
- ఎకరాకు రూ.50 వేలకు పైగా ఆదాయం




వనభసింగిలో కూరగాయల సాగులో నిమగ్నమైన గిరి మహిళలు

ముంచంగిపుట్టు: మండలంలోని వనభసింగి గ్రామ గిరిజనులు ఏడాది పొడవునా అన్ని రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. విత్తు నుంచి దిగుబడి, విక్రయం వరకు కుటుంబ సభ్యులంతా వ్యవసాయ పనుల్లో భాగస్వామ్యమవుతూ స్వయం సమృద్ధి సాధిస్తున్నారు.

**40 కుటుంబాలతో..**

గ్రామంలో 30ఏళ్ల క్రితం కేవలం 40 కుటుంబాలతో కూరగాయల సాగు మొదలైంది. ఇప్పుడు వీరి సంఖ్య 90 కుటుంబాలకు చేరింది. మారుమూల గిరిజన గ్రామాల్లో కూరగాయలు పండించడం ఒక ఎత్తయితే వాటిని మార్కెటింగ్ చేయడం మరోఎత్తు. ఇటువంటి ఒడుదుడుకులను అధిగమించి గ్రామ గిరి రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు.

**200 ఎకరాల్లో సాగు**

వనభసింగి గ్రామంలో 146 మంది గిరిజన రైతులు 200 ఎకరాల్లో పలు రకాల కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. క్యాబేజీ 20 ఎకరాలు, క్యారెట్ 20 ఎకరాలు, టమాటా 15 ఎకరాలు, మిరప 10 ఎకరాలు, బంగాళదుంప 25 ఎకరాలు, చిక్కుడు 10 ఎకరాలు, బీర 15 ఎకరాలు, వంగ 20 ఎకరాలు, కాలీఫ్లవర్ 20 ఎకరాలు, తీపి దుంపల సాగు 10 ఎకరాలు, బీర 15 ఎకరాలు, బెండ 18 ఎకరాల్లో పండిస్తున్నారు.

**ఆకుకూరల సాగులో కీలకం**

వనభసింగి గ్రామ రైతులు ఆకు కూరల సాగులో కూడా కీలకపాత్ర పోషిస్తున్నారు. వీరు పండించే కూరగాయలు, ఆకు కూరలకు మంచి డిమాండ్ ఉంది. ఎటువంటి రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా సేంద్రియ విధానంలో పండించడం వల్ల మంచి డిమాండ్ ఉంది. వీరి పండించే కూరగాయలను వినియోగదారులు పోటీపడి కొనుగోలు చేస్తుంటారు.

**మార్కెటింగ్ ఇలా..**

ముంచంగిపుట్టు, పెదబయలు, అరకు, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లో జరిగే వారపు సంతలతో పాటు ఒడిశా రాష్ట్రంలోని మాచ్‌ఖండ్, ఒనకఢిల్లీ, పాడువా సంతలకు కూరగాయలను తీసుకువెళ్లి విక్రయిస్తుంటారు.

- ఈప్రాంతంలోని సుమారు 58 గిరిజన ఆశ్రమ పాఠశాలలకు అవసరమైన కూరగాయలను సరఫరా చేస్తున్నారు.
- ప్రభుత్వం నుంచి వచ్చే రైతు భరోసా సొమ్మును సాగు పెట్టుబడికి ఉపయోగించుకుంటున్నారు. ఈ సౌకర్యం లేకముందు గతంలో పెట్టుబడి సొమ్ము వడ్డీకి తెచ్చి సాగు చేపట్టేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి పెట్టుబడి సమస్య తప్పిందని గిరి రైతులు తెలిపారు.
- రైతు భరోసా కేంద్రం ద్వారా నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. దీంతో మంచి దిగుబడులు సాధిస్తూ లాభాలు పొందుతున్నామని రైతులు తెలిపారు. మంచి ఫలితాలు సాధిస్తుండటంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

### విక్రయాలకు తగ్గట్టుగా సాగు

మా పూర్వీకుల నుంచి కూరగాయల సాగు చేస్తూ అమ్మకాలు చేస్తున్నాం. మాకున్న పొలంలో ఏడాదంతా పండిస్తాం. నాలుగైదు రకాల కూరగాయలు, ఒకటి, రెండు రకాల ఆకుకూరలను సాగు చేస్తాం. ఒక పంట కోతకు వస్తే మరో పంట వేసుకుంటాం. ఇలా చేయడం వల్ల రోజు అమ్మకానికి పంట అందుబాటులో ఉంటుంది. ఆదాయం కూడా లభిస్తుంది. ఇక్కడ పండించే కూరగాయలు రుచిగా ఉంటాయి.

– కె.రామారావు, రైతు, వనభసింగి, ముంచంగిపుట్టు మండలం

### మెరుగైన ఆదాయం

వనభసింగి గ్రామంలో 90 కుటుంబాలు ఏడాది పొడువునా కూరగాయల సాగుపైనే ఆధారపడ్డాయి. సుమారు 200 ఎకరాల్లో వీటిని పండిస్తున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను ఇప్పటికే అందించాం. సాగుకు సంబంధించిన సూచనలు, సలహాలు ఇస్తున్నాం. పెట్టుబడి సాయంగా రైతు భరోసా సొమ్మును ఉపయోగించుకుంటున్నారు. వివిధ రకాల పంటలను పండిస్తూ వారపు సంతలకు తీసుకువెళ్లి అమ్మకాలు చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు.

– పి.మోహన్‌రావు, ఏవో, ముంచంగిపుట్టు

## చింతపల్లిలో ఐటీడీఏ పీవో పర్యటన



రోగుల వార్డును పరిశీలిస్తున్న పీవో అభిషేక్

చింతపల్లి రూరల్: పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ గురువారం చింతపల్లి, తాజంగిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజంగిలో రహదారి విస్తరణకు కేటాయించిన భూముల వల్ల నష్టపోతున్న గిరిజనులకు ప్రభుత్వం తగిన పరిహారం అందిస్తుందన్నారు. జాతీయ రహదారి నిర్మాణం వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. భూ సేకరణ వల్ల గిరిజనులు నష్టపోతున్నరని కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నరని వాటిని నమ్మవద్దని ఆయన కోరారు. అనంతరం చింతపల్లి ఆస్పత్రిని సందర్శించారు. ఆపరేషన్ థియేటర్, గర్భిణుల వసతి గృహన్ని ఆయన సందర్శించారు. చిన్నపిల్లలు, గర్భిణులకు మెరుగైన సేవలు అందిచాలని సూచించారు. వైద్యాధికారులు రోగులను పరీక్షించేందుకు అదనపు గదులు కేటాయించాలని సూపరింటెండెంట్ ఆదిత్యకీర్తికి సూచించారు. ఇందుకు సంబంధించి అంచనాలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య పాల్గొన్నారు.

# నాడు–నేడు పనులు వేగవంతం

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: మన బడి నాడు–నేడులో చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవోలు, వెలుగు ఏపీఎంలతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు తెరిచే నాటికి పాఠశాలల్లో నిర్మాణ పనులు, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్ల పనులు, వంట గదుల మరమ్మతులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పాఠశాలకు వచ్చిన రివాల్వింగ్ ఫండ్ వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలల్లో మరమ్మతు పనులకు అవసరమైన సిమెంటు స్థానికంగా కొనుగోలు చేయాలని సూచించారు. పాఠశాలలను తనిఖీ చేసి నాడు–నేడు పనులు నాణ్యత, సామగ్రి రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించాలని ప్రత్యేక అధికారులకు సూచించారు.

**బడిలో చేర్పించండి**

జిల్లాలో డ్రాపౌట్లు లేకుండా నూరు శాతం పిల్లలు పాఠశాలలో ఉండేవిధంగా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవోలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు సూచించారు. ఆశ్రమ పాఠశాలలకు నిత్యావసర సరకుల పంపిణీ కాంట్రాక్టర్ల గురించి ఆరా తీశారు. పాత టెండర్లు రద్దు చేసి కొత్తగా టెండర్ల పిలవాలని గిరిజన సంక్షేమ శాక ఉప సంచాలకులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, సూరజ్ గనోరే, డీఈవో సలీం బాషా, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

**సరకుల సరఫరాకు టెండర్లు స్వీకరణ**

జిల్లాలో పాడేరు డివిజన్ పరిధిలోని 11 కేజీబీవీలకు సరకు సరఫరాకు టెండర్ల ప్రక్రియ కలెక్టర్, ఏపీ ఎస్ఎస్ చైర్మన్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. కమిటీ సభ్యులు జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేడ్కర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గణేష్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి సలీం బాషా, విద్యాశాఖ పరిపాలన అధికారి సీహెచ్.రామారావు పది మంది నుంచి షీల్డ్ టెండర్లు స్వీకరించారు. వీటిలో రెండింటిని తిరస్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ టెండర్‌లో కోట్ చేసిన ధరలను ప్రస్తుత మార్కెట్ ధరలను పరిశీలించి కమిటీ నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. టెండర్‌దారుల మూడు నెలల సరఫరాను పరిశీలించి అవసరమైతే వారిని కొనసాగించడం లేదా కొత్తవారికి కేటాయించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయం తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు. సరకుల సరఫరాలో నిబంధనలు ఉల్లంఘిస్తే టెండర్‌ను రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.



అధికారులు, టెండర్‌దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

# టీడీపీకి గడ్డుకాలం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- టీడీపీ ఇరగాయి ఎంపీటీసీ చెలమ్మ, పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక
- పార్టీ కండువాలు వేసి ఆహ్వానం



ఎంపీటీసీ సభ్యురాలు చెల్లమ్మను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: టీడీపీకి గడ్డుకాలం మొదలైందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. తెలుగుదేశం పార్టీ ఇరగాయి ఎంపీటీసీ జన్ని చెలమ్మ, అదే పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ తమ్మన్న, వార్డు సభ్యుడు సేబి రంగరావుతోపాటు 30 కుటుంబాలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి ఉరుముల గ్రామంలో ఎమ్మెల్యే పాల్గుణ పార్టీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో విస్తృతంగా చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన ఎంపీటీసీ చెల్లమ్మ, మాజీ సర్పంచ్ తమ్మయ్య వేర్వేరుగా మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పథకాలు అందిస్తుందన్నారు. జగనన్న ప్రభుత్వం పనితీరుకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్టు వారు ప్రకటించారు. ఎంపీపీ ఉషారాణి, శెట్టి అప్పాలు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మండల సర్పంచ్‌ల పోరం అధ్యక్షుడు రమేష్, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, సర్పంచ్ బుట్కి తదితరులు పాల్గొన్నారు.

# పాడేరులో ఆక్రమణల తొలగింపు

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు



పాడేరులోని ఆక్రమణలను తొలగిస్తున్న యంత్రాలు

సాక్షి, పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరులో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగింపునకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పాతబస్టాండ్ అంబేడ్కర్ సెంటర్ నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు యంత్రాలతో ఆక్రమణలు తొలగించారు. పోలీస్‌శాఖ పర్యవేక్షణలో రెవెన్యూ యంత్రాంగమంతా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమంగా ఉన్న బడ్డీలు, దుకాణాలను యంత్రాల సాయం తొలగించారు. పాడేరు సీఐ సుధాకర్ ఆధ్వర్యంలోని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఆర్‌అండ్‌బీశాఖ గతంలోని నిర్మించిన కాలువల వరకు ఆక్రమణలను తొలగించారు. ఈ కార్యక్రమంలోని వీఆర్వోలు, సచివాలయం ఉద్యోగులు, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

### ఇగ్నో ప్రవేశాలకు జూన్ 30 గడువు

విశాఖపట్నం: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)–2023లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు గురువారం తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నామన్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న కేంద్రం పరిధిలోని ఐదు జిల్లాల విద్యార్థులు https://ignouadmission. samarth.edu.in/ వెబ్‌సైట్‌లో ఆయా కోర్సుల్లో ప్రవేశాల కోసం జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# చింతాలమ్మ ఉత్సవాలు ప్రారంభం



తల్లి ఘటాలను ఊరేగిస్తున్న మహిళలు



ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమం

- నాలుగు రోజులపాటు నిర్వహణ
- ఘనంగా ఘటాల ఊరేగింపు

కొయ్యూరు: చింతాలమ్మ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఘాట్‌రోడ్డులో ప్రయాణించేవారు అమ్మవారిని ఆరాధ్యదైవంగా పూజిస్తారు. ఏటా ఈ ఉత్సవాలను మోటార్ యూనియన్ ప్రతినిధులు నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా అమ్మవారి ఘటాల ఊరేగింపును గురువారం కొయ్యూరు నుంచి ప్రారంభించారు. సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఘాట్‌రోడ్డు ప్రారంభంలో ఉన్న అమ్మవారి ఆలయం వరకు కొనసాగుతుంది. తల్లి ఉత్సవాలను నాలుగు రోజుల పాటు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నేతలు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఘటాల ఊరేగింపులో మోటారు యూనియన్ ప్రతినిధులు బాబి, శశి, శ్రీను పాల్గొన్నారు.

# మన్యంలో విస్తారంగా వర్షాలు

- జిల్లాలో ప్రతిరోజూ వర్షం
- ఖరీఫ్‌కు మేలు అంటున్న వ్యవసాయశాఖ అధికారులు
- ఈదురుగాలులతో మామిడికి నష్టం



పాడేరు అంబేడ్కర్ కూడలిలో కురుస్తున్న వర్షం



ముంచంగిపుట్టులో కురుస్తున్న వర్షం

సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని గత కొద్దిరోజులుగా వర్షాలు కొనసాగుతున్నాయి. పాడేరుతో పాటు పలు మండలాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ వ్యవసాయ పనులకు మేలుచేస్తున్నాయి. రోజూ కురుస్తున్న వర్షాలతో గిరిజన రైతులు, వ్యవసాయ అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గురువారం సాయంత్రం పాడేరు పట్టణంతో పాటుగా సమీప ప్రాంతాల్లో గంటసేపు భారీ వర్షం కురిసింది.

ముంచంగిపుట్టు: మండలంలో గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి.కొన్నిరోజులుగా మధ్యాహ్నం అయ్యే సరికి ఒక్కసారిగా ఆకాశం అంత మేఘావృతమై ఏకధాటిగా భారీ వర్షం కురుస్తోంది. వానతో పాటు వీస్తున్న ఈదురు గాలులకు మామిడి కాయలు రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఉదయం ఎండ వేడితో అల్లాడుతున్న మండల ప్రజలకు మధ్యాహ్నం కురుస్తున్న వర్షంతో కొంత ఉపశమనం లభిస్తోంది. వర్షం కారణంగా గురువారం సాయంత్రం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పెదబయలు: మండలంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో కొత్తపుట్టు నుంచి కుజభంగి వెళ్లే ప్రధాన రహదారిలో పలు చోట్ల చెట్లు నేలకు ఒరిగాయి. దీంతో సుమారు గంట మేర పెదబయలు నుంచి ముంచంగిపుట్టు వెళ్లే మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు ఎంతో కష్టపడి రహదారిపై చెట్లను తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రంలో రోడ్లపై వరదనీరు ప్రవహించింది. కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో హుకుంపేట నుంచి అరకు వెళ్లే మార్గంలో వరద నీరు అధికంగా చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొద్దిరోజులుగా ఎండవేడితో అల్లాడిన మండల వాసులకు వర్షంతో ఉపశమనం లభించింది.సంతబయలులో వరదనీరు అధికంగా చేరడంతో ఆ ప్రాంతవాసులు రాకపోకలు చేసే మార్గం బురదమయంగా మారడంతో అవస్థలు పడ్డారు.

# వంచుల చెరపల్లిలో జ్వరాల విజృంభణ

- కలుషితనీరు తాగడంతో అస్వస్థత
- పలువురిని చింతపల్లి ఆస్పత్రికి తరలింపు
- యుద్ధప్రాతిపదికన వైద్య సేవలు
- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరామర్శ



జ్వరంతో బాధపడుతున్న గిరిమహిళ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: మండలంలోని వంచుల పంచాయతీ చెరపల్లి గ్రామంలో గురువారం జ్వరాలు విజృంభించాయి. పదుల సంఖ్యలో గ్రామస్తులు మంచం పట్టారు. గ్రామంలో కలుషిత నీరు తాగడంతోనే జ్వరాలు సోకడానికి కారణమని గ్రామస్తులు తెలిపారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు అస్వస్థతకు గురికావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వీరందరినీ చింతపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరికి వైద్యులు ప్రత్యేక వైద్యసేవలు అందిస్తున్నారు.

**బాధితులకు మెరుగైన సేవలు**

చింతపల్లి: అస్వస్థతకు గురై స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని గురువారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు. గూడెంకొత్తవీధి మండలం వంచుల చరపల్లికి చెందిన గిరిజనులు విందు భోజనంలో కలుషిత జలాలు తాగడం వల్ల బుధవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఏడుగురిని స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. వారిని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరామర్శించారు. మెరుగైన సేవలందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆదిత్య కీర్తిని కోరారు. బాధితులకు రొట్టి, పాలు, పండ్లు అందజేశారు. ఈకార్యక్రమంలో చింతపల్లి,గూడెంకొత్తవీధి ఎంపీపీలు అనూష దేవి, కుమారి, గూడెంకొత్తవీధి మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కంప్యూటర్ నైపుణ్య పరీక్షకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు

సాక్షి, విశాఖపట్నం: ఏపీపీఎస్సీ శుక్రవారం నిర్వహించనున్న కంప్యూటర్ నైపుణ్య పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. పరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో డీఆర్వో తన ఛాంబర్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ విభాగంలో పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-5, రెవెన్యూ శాఖలో గ్రామ రెవెన్యూ అధికారి గ్రేడ్-2, వీఆర్‌ఓ గ్రేడ్-1, హెచ్‌వోడీలు, డైరెక్టరేట్‌లలో కారుణ్య ప్రాతిపదికన నియమితులైన ఉద్యోగులకు ఏపీపీఎస్సీ కంప్యూటర్ నైపుణ్య పరీక్ష నిర్వహిస్తోందన్నారు. ఈ పరీక్ష పెదగంట్యాడలోని ఎస్‌వీఎస్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ కేంద్రంగా జరుగుతుందనీ, 402 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష నాలుగు షిఫ్టులలో జరుగుతుందని, కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణానికి తప్పని పాట్లు

## పాక్షికంగా దెబ్బతిన్న వంతెన

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి శివారున కొక్కెరగెడ్డ వాగుపై ప్రధాన రహదారిపై బ్రిటీష్ కాలం నాటి ఇరుకు వంతెన గురువారం సాయంకాలం పాక్షికంగా కూలిపోయింది. దీంతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ వంతెన ఎడమ వైపున గల రక్షణగోడ గతంలో కూలిపోయింది. ఇప్పుడు కుడివైపున గోడతో పాటు వంతెన అడుగు భాగం కూడా దెబ్బతింది. విషయం తెలుసుకున్న జడ్డంగి ఎస్ఐ షరీఫ్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితి సమీక్షిస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలను నియంత్రించారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు చిన్నకార్లు మాత్రమే వంతెన దాటేందుకు అనుమతిస్తున్నారు.

ఈ ప్రాంతంలో ఎన్‌హెచ్ 516ఈ ప్రధాన రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న సిబ్బంది వంతెనపై రాకపోకలు పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నారు. గడ్డర్లు ఏర్పాటు చేసి వంతెనకు తాత్కాలికంగా మరమ్మతు పనులు చేపడుతున్నారు. వంతెన దెబ్బతినడంతో నర్సీపట్నం, ఏలేశ్వరం, రాజమహేంద్రవరం, కాకినాడ, రంపచోడవరం, భద్రాచలం తదతర ప్రాంతాలకు రాకపోకలు ప్రశ్నార్థకంగా మారింది.



జడ్డంగి వద్ద దెబ్బతిన్న ఇరుకు వంతెన

### భారీ వాహనాల దారి మళ్లింపు

వంతెన దెబ్బతినడంతో భారీ వాహనాలను దారి మళ్లించినట్లు జడ్డంగి ఎస్ఐ షరీఫ్ గురువారం రాత్రి తెలిపారు. భారీ వాహనాలు జడ్డంగి నుంచి కొమరాపురం, చికిలింత, కరుదేవపాలెం, వంచంగి, రత్నాలపేట, అడ్డతీగల మండలానికి చెందిన పులిగోగులపాడు, గొంటువానిపాలెం గ్రామాల మీదుగా ఏలేశ్వరం వెళ్లాలని ఆదేశించారు. దీంతో సుమారు 25 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి ఉంటుందని డ్రైవర్లు చెబుతున్నారు. జడ్డంగి వంతెన మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిపివేయాలని ఏలేశ్వరం, నర్సీపట్నం, పాడేరు, రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్ డిపో మేనేజర్లకు సూచించినట్టు ఎస్ఐ షరీఫ్ తెలిపారు. ప్రయాణీకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. జడ్డంగి ఇరుకు వంతెన మరమ్మతు పనులు శుక్రవారం సాయంకాలానికి పూర్తయ్యే అవకాశాలున్నాయని చెప్పారు.



వంతెనను పరిశీలిస్తున్న ఎస్ఐ షరీఫ్

## గిరిజనేతరుల చేతిలో భూములు కాపాడుకోవాలి

### ఏఐఏఆర్ఎల్ఏ జాతీయ అధ్యక్షుడు సత్యదేవ్‌రామ్



సమావేశానికి హాజరైన ఆదివాసీలు



సమావేశంలో మాట్లాడుతున్న సత్యదేవ్‌రామ్

అనకాపల్లి టౌన్: ఏజెన్సీల్లో గిరిజనేతరుల చేతిలో మన భూములు కాపాడుకోవాలని, లేదంటే ఆదివాసీ సంతతి కనుమరుగై పోతుందని బీహార్ రాష్ట్రం పాట్నా ఎమ్మెల్యే, అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం(ఏఐఏఆర్ఎల్ఏ) జాతీయ అధ్యక్షుడు సత్యదేవ్‌రామ్ అన్నారు. స్థానిక న్యూకాలనీ తాటికొండ నూకయ్యశెట్టి మెమోరియల్ హాల్లో అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం జిల్లా ఐదో మహాసభకు గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ భాష ఏదైనప్పటికీ గ్రామీణ కార్మికుల సమస్యలు రోజురోజుకు దిగజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కువగా రైతులు ఏపీలోనే ఉన్నారని, వీరంతా వ్యవసాయ కార్మిక సంఘాలు ఏర్పడి హక్కుల కోసం కలిసికట్టుగా పోరాటాలు చేయాలని సూచించారు. పేదల సమస్యలను పక్కతోవ పట్టించడానికి మోదీ ప్రభుత్వం మతోన్మాదం అనే కొత్త వాదాన్ని అనుసరిస్తుందన్నారు. ప్రధాని మోదీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాటాలు చేసేందుకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ, పంజాబ్‌లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పేదలకు అందిస్తున్నారని, మిగిలిన రాష్ట్రాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.1,500 నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి నైనాలశెట్టి మూర్తి, పార్లమెంట్ కార్యదర్శి పి.ఎస్.అజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎస్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## అన్ని రంగాల్లో రాణించాలి

- అల్లూరి జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వేణుగోపాలరావు

అనంతగిరి: యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు పోలీస్‌శాఖ సిద్ధంగా ఉందని, అల్లూరి జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వేణుగోపాలరావు అన్నారు. మండల కేంద్రంలోని రోయల్ రిసార్ట్స్ వద్ద గురువారం సూర్యవాణి అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వేణుగోపాలరావు, ఎంపీపీ శెట్టి నీలవేణి ముఖ్య అతిథిలుగా హాజరైయ్యారు. అనంతరం యువతను ఉద్దేశించి డీఎస్పీ వేణుగోపాలరావు మాట్లాడుతూ యువత అసాంఘిక కార్యకలపాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో యువత అన్ని రంగాల్లో రాణించాలని, అలాగే పోలీస్‌శాఖ తరపున అన్ని విధాలుగా సహకారం అందిస్తామన్నారు. అనంతరం ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమని, క్రీడల్లో యువత రాణించాలని, అకాడమీకి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ వేణుగోపాలరావును అకాడమీ సభ్యులు శాలువతో ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, అకాడమీ అధ్యక్షుడు కమిడి రాజ్‌కుమార్, సభ్యులు రఘు, సత్య, చందు, రాజు, స్వామి, శ్రీరాములు, బాబీ పాల్గొన్నారు.

## మద్యం మత్తులో కత్తితో దాడి.. ఒకరు మృతి



మృతి చెందిన చిన్నారావు

గూడెంకొత్తవీధి : మద్యం మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన వివాదం ఒకరి హత్యకు కారణమైంది. ఈ ఘటనలో గూడెంకొత్తవీధి మండలం జర్రెల పంచాయతీ కొండకించంగి గ్రామానికి చెందిన గెమ్మెలి చిన్నారావు మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పూజారి మల్లన్న అదే గ్రామానికి చెందిన చిన్నారావు స్నేహితులు. వీరిద్దరూ బుధవారం రాత్రి మద్యం సేవించారు. అంతకు ముందు మల్లన్న భార్యతో చిన్నారావు ఘర్షణ పడినట్టు చెబుతున్నారు. తన భార్యపై చేయి చేసుకుంటావా.. అంటూ మల్లన్న చిన్నారావుతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో అతని వద్ద ఉన్న కత్తితో చిన్నారావు మెడపై దాడిచేశాడు. దీంతో చిన్నారావు తీవ్రంగా గాయపడ్డాడు. ఇతన్ని కుటుంబ సభ్యులు చింతపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలిస్తుండగా చిన్నారావు మరణించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీకే వీధి పోలీసులు తెలిపారు.

# బాధ్యతగా పర్యావరణ రక్షణ



పెదబయలు కూడలిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

పెదబయలు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని. చెట్లను నాటాలని పెదబయలు అటవీ శాఖ రేంజ్ అధికారి చంద్రశేఖరరావు అన్నారు. మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణహిత జీవన శైలి కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఒక్కరు చెట్లను పెంచాలని, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని, ఇంటింటా చెట్లు ఊరంతా వనం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని నినాదాలు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నాయన్నారు. మాజీ జెడ్పీటీసీ కొంటా సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండబాబు, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: పర్యావరణ రక్షణ బాధ్యతగా అందరూ స్వీకరించాలని రాంకీ-నాబార్డు మా తోట ప్రాజెక్ట్ మేనేజర్ పి.హరికృష్ణ కోరారు. మండలంలోని ఎం.మాకవరం, నల్లగొండ గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని, ప్రకృతి జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని వీడాలన్నారు. పాలథిన్ కవర్లు వినియోగించొద్దన్నారు. మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో స్థానికులతో పర్యావరణ పరిరక్షణకు మద్దతుగా ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లో విస్తృతంగా ఈనెల 28వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

# ఇంక్యుబేషన్ సెంటర్‌కు శ్రీకారం



ఇంక్యుబేషన్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి



పుస్తకావిష్కరణలో ఎంపీ సత్యవతి, ప్రశాంతి, తదితరులు

- విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రోత్సాహం

అనకాపల్లి టౌన్: విలువ ఆధారిత ఉత్పత్తులకు మంచి ప్రోత్సాహం అందించే ఇంక్యుబేషన్ సెంటర్‌కు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి గురువారం శ్రీకారం చుట్టారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) ఆవరణలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. పీఎంఎఫ్ఎంఈ (ప్రైమ్ మినిస్టర్స్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్)లో భాగంగా కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహకారంతో నెలకొల్పుతున్న ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా వ్యవసాయ ఉత్పత్తులతోపాటు వాటి ఆధారిత ఉత్పత్తులు కూడా ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి కానున్నాయి. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ.. ఈ సెంటర్‌లో చెరకు, చిరుధాన్యాలు, పనసల ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయడం ఎంతో ప్రయోజనకరమన్నారు. ఇది రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయిలో అనకాపల్లి బెల్లానికి గుర్తింపు ఉందన్నారు. ఇక్కడి రైతులు దశాబ్దాల కాలంగా చెరకును పండిస్తూ ఈ ప్రాంతానికి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.3 కోట్లు విడుదల చేయగా అందులో రూ.కోటితో భవన నిర్మాణం, మిగిలిన నిధులతో చెరకు, పనస, చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీకి యంత్రాలను కొనుగోలు చేయనున్నామన్నారు. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అదనంగా మరో రూ.30 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. నిరుద్యోగ యువతీ యువకులకు చిరుధాన్య వంటకాలపై శిక్షణతోపాటు కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగదు ప్రోత్సాహాన్ని అందజేస్తాయని చెప్పారు.

### ఆరు నెలల్లో పూర్తి

వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఎల్.ప్రశాంతి మాట్లాడుతూ ఇంక్యుబేషన్ సెంటర్‌తోపాటు వ్యవసాయ విస్తరణకు కృషి చేయాలన్నారు. ఈ ఆర్ఏఆర్ఎస్ నుంచి శాస్త్రవేత్తలు ఇంతవరకు 20 చెరకు వంగడాలను అందించారన్నారు. టన్ను చెరకుకు రూ.600 ఆదాయం సమకూరినట్లయితే రైతులు చెరకు పంటపై ఆసక్తి చూపుతారన్నారు. ఈ భవనాన్ని ఆరు నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు మార్కెటింగ్ చేసుకునే విధంగా ప్రొడక్టు తయారీకి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. బెల్లాన్ని కోల్డ్‌స్టోరేజీలో నిల్వ చేసి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించడం ద్వారా లాభాలు అధికంగా వస్తాయన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తులు, చిరుధాన్యాలు, చెరకులో ఆధునిక పద్ధతులపై పుస్తకాలను డాక్టర్ ప్రశాంతి, ఎంపీ సత్యవతిల ఆవిష్కరించారు. చిరుధాన్యాల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఉద్యానవనశాఖ జిల్లా అధికారి ప్రభాకర్, వ్యవసాయ శాఖ జేడీ మోహనరావు, ఎన్టీఆర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, ఎస్‌వీడీఎస్ సంస్థ వ్యవస్థాపకుడు కాండ్రేగుల జోగినాయుడు, శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, భాగ్యలక్ష్మి, అనురాధ, ఎంఎంవి.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, చిరుధాన్యాల అక్కచెల్లెళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## పరారైన గంజాయి నిందితుడు అరెస్ట్

సీతమ్మధార(విశాఖ ఉత్తర): ద్వారకా పోలీస్ స్టేషన్ నుంచి ఇటీవల పరారైన గంజాయి నిందితుల్లో ఒకరిని ఎట్టకేలకు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం కుడ్డాలూరు జిల్లా, కిజుహర్ మెయిన్ రోడ్డుకు చెందిన వి.సురేష్(22), త్రిమూర్తి(23) శనివారం రామాటాకీస్ సమీపంలో ద్వారకానగర్ పోలీసులకు ఏడు కిలోల గంజాయితో పట్టుబడ్డారు. సోమవారం తెల్లవారుజామున విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిద్రలోకి జారుకోవడంతో నిందితులిద్దరూ బేడీలు తీసుకుని పరారైన ఘటన తెలిసిందే. సీఐ సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి తమిళనాడు వెళ్లారు. బుధవారం రాత్రి త్రిమూర్తి(23)ని అదుపులోకి తీసుకున్నారు. గురువారం నగరానికి తీసుకువచ్చి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. మరో నిందితుడ్ని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు.

# వేలిముద్రల ఇక్కట్లకు చెక్

- రేషన్ సరకుల పంపిణీకు ఐరిస్ పరికరాలు
- వేలిముద్రలు పడక సరకులు పొందలేకపోతున్న వారికి ఊరట
- వచ్చే నెల నుంచి కొత్త విధానం అమలు



ఐరిస్ పరికరాలు

సాక్షి, విశాఖపట్నం : రేషన్ పంపిణీ విధానంలో మార్పులకు ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు తెల్లరేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు బయోమెట్రిక్ (వేలి ముద్రలు) ఆధారంగా రేషన్ పంపిణీ చేస్తోంది. ఇప్పటివరకూ ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తూ వస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో కీలకమైన నిర్ణయాన్ని తీసుకొంది. లబ్ధిదారులకు ప్రతినెలా రేషన్ సరకులు పంపిణీ చేస్తున్న సమయంలో పలు చోట్ల వేలిముద్రల సమస్య ఎదురవుతోంది. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉత్పన్నమవుతోంది. ఇంటి పనులు చేసినవాళ్లు, కూలి పనులకు వెళ్లే వాళ్లు, వృద్ధులు.. ఇలా చాలా మందికి వేలిముద్రల్లో రేఖలు అరిగిపోయాయి. ఆధార్ కార్డు అప్‌డేషన్‌కు వెళ్లే సమయంలోనూ ఇదే పరిస్థితి ఎదురవుతోంది. దీంతో రేషన్ తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫలితంగా జిల్లాలో కనీసం ప్రతి నెలా 1500 నుంచి 2 వేల మంది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

### వచ్చే నెల నుంచి ఐరిస్ ద్వారా రేషన్

బయోమెట్రిక్ వల్ల లబ్ధిదారులు రేషన్ తీసుకోకుండానే వెనుదిరగాల్సిన పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం తక్షణ చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటివరకు సరుకుల పంపిణీలో ఉన్న బయోమెట్రిక్ విధానంతో పాటు ఐరిస్ (కంటి గుర్తింపు) విధానం కూడా అమల్లోకి తేవాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఇటీవలే పౌరసరఫరాలశాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే జూన్ నుంచి ఈ రెండు విధానాల్లో రేషన్ పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించిన ఐరిష్ పరికరాలను జిల్లా పౌర సరఫరాల అధికార యంత్రాంగం అందుబాటులోకి తీసుకొచ్చింది. కలెక్టరేట్‌లో జేసీ కె.ఎస్.విశ్వనాథన్ చేతుల మీదుగా జిల్లా పరిధిలోని ఎండీయూ ఆపరేటర్లకు అందజేశారు.